



- గతనెల 30న మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై అవిశ్వాసం
- మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిని తొలగిస్తూ ఉత్తర్వులు
- ఇక చైర్‌పర్సన్ ఎన్నికే లాంఛనం
- కాంగ్రెస్ నుంచి పలువురు ఆశావహులు
- ముగ్గురు మధ్యనే తీవ్ర పోటీ
- తెరపైకి బీజేపీ చైర్‌పర్సన్?
- పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్‌లతో బీజేపీ సంప్రదింపులు
- చక్రం తిప్పేందుకు బీజేపీ ఎత్తులకు పై ఎత్తులు

చైర్‌పర్సన్ పీఠం దక్కేదెవరికో?

కామారెడ్డి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి)/కామారెడ్డి అర్బన్, ఏప్రిల్ 5: కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠంపై రాజకీయం రంజుగా సాగుతోంది. గత నెలన్నరగా మున్సిపల్ పరిధిలో చైర్‌పర్సన్ పీఠంపై ఎక్కడ చూసినా తీవ్ర చర్చ సాగుతోంది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై కాంగ్రెస్ కౌన్సిలర్‌లు అవిశ్వాసం పెట్టడంతో గత నెల 30న అవిశ్వాస సమావేశాన్ని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ నిర్వహించారు. ఆ తీర్మాన కాపీని రాష్ట్ర మున్సిపల్‌శాఖకు సైతం అధికారులు పంపారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా నిట్టు జాహ్నవిని తొలగించే వరకు ఆమె చైర్‌పర్సన్‌గా కొనసాగుతారని అధికారులు సైతం పేర్కొన్నారు. అయితే గత వారం రోజులుగా రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడెప్పుడు అవిశ్వాస తీర్మానంపై చర్యలు చేపడుతుందోనని ఎదురుచూస్తున్న కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్‌లకు మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిని తొలగిస్తూ వచ్చిన ఉత్తర్వులతో ఊరట లభించినట్లయింది. ఇక చైర్‌పర్సన్ ఎన్నికే లాంఛనంలా కనిపిస్తోంది. ఎన్నికల కమిషన్ ఎప్పుడు చైర్‌పర్సన్ ఎన్నికకు తేదీ ప్రకటిస్తుందోనని వేచి చూడాల్సిన పరిస్థితి కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్‌లకు ఏర్పడింది. అయితే కాంగ్రెస్ పార్టీ నుంచి పలువురు కౌన్సిలర్‌లు చైర్‌పర్సన్ పీఠంపై ఆశ పడుతున్నారని కాంగ్రెస్ పెద్దల ఆశీస్సుల కోసం అన్నివిధాల ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా బీజేపీ సైతం చైర్‌పర్సన్ పీఠంను దక్కించుకుని కాంగ్రెస్‌కు ట్విస్ట్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. కాంగ్రెస్ వేస్తున్న ఎత్తులకు పై ఎత్తులు వేసి బీజేపీ కౌన్సిలర్‌ను చైర్‌పర్సన్ పీఠంపై కూర్చునేలా బీజేపీ పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.

చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిని తొలగిస్తూ ఉత్తర్వులు?

మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిని తొలగిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు గత రెండు రోజుల కిందట వెలువడినట్లు సమాచారం. అయితే అధికారికంగా కలెక్టర్, మున్సిపల్ అధికారులు ధ్రువీకరించాల్సి ఉంది. అసెంబ్లీ ఎన్నికల వరకు నలుగురు కౌన్సిలర్‌లు మాత్రమే ఉన్న కాంగ్రెస్‌లో ఎన్నికల సమయం నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల కాలంలో దాదాపు 27 మంది కౌన్సిలర్‌లకు పుంజుకుంది. ఆ తర్వాత బీఆర్ఎస్ పార్టీకి చెందిన చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై అవిశ్వాస నోటీసులు అందించి దాదాపు 18 రోజుల పాటు క్యాంపు రాజకీయాలు చేపట్టింది. అవిశ్వాసం నెగ్గాలంటే మ్యాజిక్ ఫిగర్ 34 ఉండాల్సి ఉండగా బీఆర్ఎస్‌లోని పది మంది కౌన్సిలర్‌ల మద్దతు కోరి బీఆర్ఎస్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస ఓటింగ్ నిర్వహించి పదవి కోల్పోయేలా చక్రం తిప్పి సక్సెస్ అయింది. అయితే గత నెల 30న అవిశ్వాసం నిర్వహించి తీర్మానకాపీని రాష్ట్ర మున్సిపల్ శాఖకు అధికారులు పంపించడంతో చైర్‌పర్సన్ పీఠంపై ఆశలు పెట్టుకున్న ఆశావహులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్‌లు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూశారు. తీరా చైర్‌పర్సన్‌ను తొలగిస్తూ ఉత్తర్వులు రావడంతో ఎన్నికల కమిషన్ ఎప్పుడు తేదీని ప్రకటిస్తుందోనని వేచి చూస్తున్నారు.

ఇక చైర్‌పర్సన్ ఎన్నికే లాంఛనం

బీఆర్ఎస్ చైర్‌పర్సన్ దింపేందుకు అస్త్రశస్త్రాలు ఉపయోగించిన కాంగ్రెస్ పార్టీ తీరా వారు అనుకున్న విధంగా అవిశ్వాసం నిర్వహించి చైర్‌పర్సన్‌ను పదవి నుంచి తొలగించారు. ఇక చైర్‌పర్సన్ పీఠంను ఎవరు అధిరోహిస్తారనే దానిపై దృష్టి సారిస్తుండగా పోటీలో నలుగురైదుగురు పేర్లు వినిపిస్తుండ గా ఇందులో కేవలం ముగ్గురు మాత్ర మే సీరియస్‌గా చైర్‌పర్సన్ పీఠం దక్కించేందుకు తమ ప్రయత్నాలు చేస్తున్నారని తెలుస్తోంది. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి, ఉరుదొండ వనిత రవి, ఇల్లెందుల లత వేణుల పేర్లు ప్రధానంగా వినిపి స్తున్నాయి. వీరంతా ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ ఆశీస్సులు ఎవరిపై ఉంటాయోనని వేచి చూస్తున్నారని తెలుస్తోంది. బీఆర్ఎస్ నుంచి పెద్ద ఎత్తున కౌన్సిలర్‌లను కాంగ్రెస్ పార్టీలో చేరేలా కృషి చేసిన వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి, ఉరుదోండ వనిత రవిలలో ఎవరికో ఒకరికి అవకాశాలు ఉండనున్నాయని మరోపక్క కాంగ్రెస్ శ్రేణులు, పలువురు కౌన్సిలర్‌లు పేర్కొనడం గమనార్హం.

తెరపైకి బీజేపీ చైర్‌పర్సన్?

ఎట్టకేలకు బీఆర్ఎస్ చైర్‌పర్సన్‌ను పదవి కోల్పోగా కాంగ్రెస్ పార్టీ చైర్‌పర్సన్ పీఠం దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తుండగా సరైన సమయంలో దిమ్మ తిరిగే షాక్ ఇచ్చేందుకు బీజేపీ పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఇప్పటికే రెండు సార్లు మున్సిపల్ సమావేశాలల్లో పాల్గొని మున్సిపల్‌లో ప్రజలకు అవినీతిరహిత పాలన అందించడంతో పాటు మున్సిపల్ ఆదాయం పెంచేందుకు అందరం కలిసి కృషి చేద్దామంటూ అన్ని పార్టీల కౌన్సిలర్‌లతో చర్చించారు. అందుకు తగ్గట్టుగా ఇప్పటికే రోడ్డు విస్తరణ పనులతో పాటు మున్సిపల్ రెవెన్యూ విభాగంలో లోపాలను సవరించే విధంగా అధికారులకు దిశా నిర్దేశం చేయడంతో పాటు అమలుకు శ్రీకారం చుట్టారు. అయితే ప్రస్తుతం చైర్‌పర్సన్ దిగిపోవడంతో తాను అనుకున్న విధంగా ప్రజలకు సేవలు చేరువ చేసేందుకు చైర్‌పర్సన్ పీఠం బీజేపీకి దక్కేలా ఆలోచన లు చేస్తున్నట్లు సమాచారం. చైర్‌పర్సన్ పీఠం అధిరోహించాలంటే 26 మంది కౌన్సిలర్‌ల మద్దతు కావాల్సి ఉండగా బీజేపీకి ఆరుగురు కౌన్సిలర్‌లు, ఎమ్మెల్యే ఎక్స్‌ఆఫిసియో ఓటు 1 ఉన్నాయి. బీఆర్ఎస్ కౌన్సిలర్‌ల మద్దతు కూడ బెట్టేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మొత్తం బీఆర్ఎస్ కౌన్సిలర్‌లు 16 మంది ఉండగా అందులో కొందరు సహకరించకపోయిన అవసరమైతే కాంగ్రెస్ పార్టీలోని పలువురు కౌన్సిలర్‌ల మద్దతు పొందేందుకు ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ బీజేపీ చైర్‌పర్సన్ దక్కించుకుంటే అందులో కేవలం ఇద్దరు మహిళ కౌన్సిలర్‌లు మాత్రమే ఉన్నారు. ఒకరు ఆకుల సుజితభరత్ కాగా, మరొకరు హన్మండ్ల మానస సురేష్‌లు. వీరిద్దరిలో ఎవరికి చైర్‌పర్స న్ సీటు దక్కుతుందనేది ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి నిర్ణయంపై ఉందనే వాదనలు బీజేపీ శ్రేణుల నుంచి వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా మరో వారం పది రోజుల్లో చైర్‌పర్సన్ పీఠం కాంగ్రెస్‌కు దక్కనుందా.. బీజేపీకి దక్కనుందా అనేది తేటతెల్లం అవనుందనే వాదనలు వినిపిస్తున్నాయి.



జాతి సమగ్రతకు తన జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి జగ్జీవన్‌రాం

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



బాబూ జగ్జీవన్‌రాం చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్

కామారెడ్డి అర్బన్, ఏప్రిల్ 5: జాతి సమగ్రతకు, సమ సమాజ స్థాపనకు తన జీవితం ధారపోసిన దేశభక్తుడు, దార్శనికుడు భారత మాజీ ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రాం అని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. శుక్రవారం కామారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రాం జయంతి వేడుకలను జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాను సమాజానికి ఏమి చేయాలనే ఆలోచనను దాటి సమసమాజ స్థాపనకు ఆయన ఒక్కడుగా ముందుకొచ్చారని, అప్పుడు ఆయన చేసిన సంస్కరణలు ఇప్పటికీ శిరోధార్యమని అన్నారు. ప్రపంచంలో ఏమి జరుగుతుందనే విషయాలపై కాకుండా దేశంలో ఏమి జరుగుతున్నది చుట్టూ ఉన్న సమాజానికి ఏమి చేయాలని అని నిరంతరం తపనపడ్డారని, అలాంటి దృక్పథం, సంకల్ప బలం నేటి సమాజంలో తప్పనిసరి అవసరమని అన్నారు. రాజకీయంగా ఆయన ఎన్నో ఉన్నత పదవులను అధిరోహించారని, దేశం క్లిష్టతరమైన సమస్యలు ఎదుర్కొన్న సమయంలో ఆయన ముందుండి సమస్యలను పరిష్కరించి విజయం సాధించారని, దేశ వ్యవసాయ శాఖ మంత్రిగా హరిత విప్లవం సాధించారని, బంగ్లాదేశ్ విమోచన సమయంలో ఆయన దేశ రక్షణ మంత్రిగా నిరుపమానమైన సేవలందించడంతో పాటు దేశ సుస్థిరతకు బాటలు వేశారని తెలిపారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని అందరు ముందుకు సాగాలని, జాతి సంక్షేమం కోసం నిర్వహించే కార్యక్రమాలలో ముందు వరుసలో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రజిత, పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రోమోర్ సిబ్బందిపై రైతుల ఆగ్రహం

బీర్కూర్, ఏప్రిల్ 5: బీర్కూర్ మండల కేంద్రంలో శుక్రవారం పంట నష్టపోయిన రైతులతో గ్రోమోర్ సిబ్బంది సమావేశమయ్యారు. తమకు నకిలీ విత్తనాలు ఎందుకు అంటగట్టారని రైతులు సదరు సంస్థ సిబ్బందిని నిలదీశారు. వారు కారణాలు చెప్పేందుకు ప్రయత్నించగా రైతులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బీర్కూర్‌లో సుమారు మూడు వందల మంది రైతులు గ్రోమోర్‌లో వరి విత్తనాలు కొనుగోలు చేసి పంటలు పండించారు. వరి కోతలు ప్రారంభమైన ఈ రైతుల పంటలు కోతకు రాలేదు. దీనికి తోడు వరి పంట పొల్లుగా మారిపోయింది. దీంతో రైతులు భయాందోళనలకు గురయ్యారు. గ్రోమోర్ వారు నకిలీ విత్తనాలు అంటగట్టారని వ్యవసాయశాఖ అధికారులకు, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా గ్రోమోర్ సంస్థ వారు రైతులకు రోజుకో మాట చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం సంస్థ వారు తమ సిబ్బందిని బీర్కూర్‌కు పంపించగా, వారు రైతులతో మాట్లాడారు. తనపై అధికారులు వచ్చి మాట్లాడుతారని రైతులతో పేర్కొనగా రైతులు ఒక్కసారిగా ఆగ్రహావేశాలకు లోనయ్యారు. సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నష్ట పరిహారం అందించకుంటే ఆందోళనలు చేస్తామని రైతులు హెచ్చరించారు. శనివారం తమ సంస్థ అధికారులు వచ్చి మాట్లాడి, సమస్య పరిష్కరిస్తారని సిబ్బంది రైతులను కోరారు.



ఎల్లారెడ్డిలో ట్యాంకర్ వద్ద నీటిని తీసుకెళుతున్న మహిళలు (ఫైల్)

గొంతులు ఎండుతున్నాయ్!

- సక్రమంగా అందని మిషన్ భగీరథ నీరు

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 5 : జిల్లాలో పల్లెల్లో, పట్టణాల్లో వేసవిలో ప్రజలు తాగునీటి కోసం అష్టకష్టాలు పడుతున్నారు. మిషన్ భగీరథ తాగునీరు ఒక రోజు వస్తే రెండు రోజులు అందడం లేదని వేసవికి ముందే పరిస్థితి ఇలా ఉంటే వేసవిలో ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ అధికారులు గ్రామాల్లో, పట్టణాల్లో తాగునీరు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఒకటవ వార్డులో తాగునీరు రావడం లేదని, పశువుల తొట్టి వద్ద ఏర్పాటు చేసిన ట్యాప్ వద్ద లైన్‌లో నిలబడి నీళ్లు పట్టుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా ఎల్లారెడ్డి మండలంలోని చాలా గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో గ్రామ పంచాయతీ కార్యదర్శులు ట్యాంకర్ ద్వారా గ్రామస్థులకు సరఫరా చేశారు. ఈ సందర్భంగా ప్రజలు మాట్లాడుతూ వేసవి కాలంలో ఇప్పుడే ఇంత నీటి ఎద్దడి ఉంటే రాబోయే రోజుల్లో ముందు ఎలా ఉంటుందో అని ఆందోళన చెందుతున్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఇకనైనా స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



కుళాయి వద్ద క్యూ కడుతున్న గ్రామస్థులు

జాతీయ రహదారులు రక్తమోడుతున్నాయ్

- ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్న వైనం
- మద్యం తాగి వాహనాలను నడపడంతోనే ఎక్కువగా ప్రమాదాలు
- రహదారిపై బ్లాక్‌స్పాట్‌లను గుర్తించిన పోలీసులు

భిక్కనూరు, ఏప్రిల్ 5: కామారెడ్డి జిల్లాలో భిక్కనూరు మండలంలోని బస్వాపూర్ నుంచి మొదలుకుని సదాశివనగర్ మండలంలోని దగ్గి వరకు దాదాపుగా 55 కిలో మీటర్ల 44వ జాతీయ రహదారి ఉంది. ఈ జాతీయ రహదారితో పాటుగా జిల్లాలో అంతర్గత రోడ్లపై నిత్యం ఎక్కడో ఒక చోట చాలా రోడ్డు ప్రమాదాలతో రహదారులు రక్తమోడుతున్నాయి. ఆ రహదారులపై ఎక్కువగా మద్యం తాగి వాహనాలు నడపటం, ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడంతో పాటుగా 44వ జాతీయ రహదారిపై చాలా వరకు సరైనా వసతులు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎన్‌హెచ్ఏఐ, రవాణ, పోలీసుశాఖ అధికారులు ఎప్పటికప్పుడు ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలను(బ్లాక్ స్పాట్)లను గుర్తించడం, వాహనదారులకు అవగాహన కల్పిస్తూ అక్కడ రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నారు.

జరిమానాలు విధించినా.. జైలు శిక్ష పడినా వాహనదారుల్లో రాని మార్పు

మద్యం తాగి వాహనాలను నడిపే వాహనదారులకు జరిమానాలు విధించినా ఎక్కువ మందిలో మార్పు రావడం లేదు. మద్యం తాగి డంకెన్‌డ్రైవ్‌లో భాగంగా పోలీసులకు మొదటిసారి పట్టుబడితే జరిమానా విధించడం, రెండవసారి పట్టుబడితే ఎక్కువ మొత్తంలో జరిమానాలు విధించడం, మోతాదు బట్టి జైలు శిక్ష పడటం జరుగుతుంది. జరిమానాలు విధించి, జైలు శిక్ష పడుతున్న, గ్రామాల్లో మద్యం తాగి వాహనాలు నడపటం కారణంగా జరుగుతున్న ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టినా మద్యం తాగి వాహనాలు నడిపే వారిలో ఎలాంటి మార్పు రావడం లేదు. జిల్లాలోని ప్రతీ పోలీసుస్టేషన్ పరిధిలో ప్రతిరోజూ డంకెన్‌డ్రైవ్ కార్యక్రమాలను పోలీసులు ముమ్మరంగా చేపడుతున్నారు. ఎక్కువగా గ్రామశివారుల్లో ఆ కార్యక్రమాలను చేపడుతూ పట్టుబడిన వారికి జరిమానాలను విధిస్తున్నారు.

అండర్‌పాస్ బ్రిడ్జీలు లేకపోవడంతో..

జిల్లాలోని 44వ జాతీయ రహదారికి ఇరువైపుల చాలా గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలకు వెళ్లేందుకు చాలా చోట్ల అండర్‌పాస్ బ్రిడ్జీలు లేవు. దీంతో రోడ్డు దాటుతుండగా, వాహనాల వేగాన్ని అంచనా వేయకపోవడంతో ఈ మద్యం మత్తులో రోడ్డును దాటడం మూలంగా ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల అండర్‌బ్రిడ్జిలను ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు రోడ్డెక్కి ఆందోళన కార్యక్రమాలు చేట్టిన సంఘటనలు ఉన్నాయి. చాలా గ్రామాల్లో ఇప్పటి వరకు సర్వీస్ రోడ్లను సైతం పూర్తి చేయలేదు.



వాహనదారులను తనిఖీ చేస్తున్న దృశ్యం



జంగంపల్లిలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవు

- సాయికుమార్, ఎస్సై భిక్కనూరు.



జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటి వరకు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రదేశాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గుర్తించడం జరిగింది. అక్కడ ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. ముఖ్యంగా ప్రతిరోజూ రోడ్లపై డ్రంకెన్‌డ్రైవ్ కార్యక్రమాలను చేపడుతున్నాం. మద్యం తాగి వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటి వరకు చాలా మందికి జరిమానాలతో పాటుగా జైలుశిక్ష సైతం పడింది. అండర్‌బ్రిడ్జీల ఏర్పాటుకు నేషనల్ హైవే అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

బ్లాక్ స్పాట్‌ల గుర్తింపు

భిక్కనూరు మండలంలోని బస్వాపూర్ నుంచి సదాశివనగర్ దగ్గి వరకు పోలీసు, రవాణ శాఖ, నేషనల్ హైవే అథారిటీ అధికారులు ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్న ప్రదేశాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించారు. ఈ బ్లాక్ స్పాట్‌ల వద్ద ప్రమాదాలను తగ్గించేందుకు, ఆయా ప్రాంతాల్లో వాహనాల వేగం తగ్గించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా ప్రమాద సూచికల బోర్డులు ఏర్పాటు చేయడం, వైట్ లైన్లు ఏర్పాటు చేయడంతో పాటుగా అనవసరమైన యూటర్న్‌లను మూసివేస్తున్నారు.


జిల్లా బాల సాహిత్య వేదిక సభ్యులు

జిల్లా బాల సాహిత్య వేదిక ఏర్పాటు

నిజామాబాద్ రూరల్, ఏప్రిల్, 5: బాలల్లో సృజనశీలత పెంచడం, కవితలు, కథలు రాసేవిధంగా ప్రోత్సహించడం వంటి పలు సాహిత్య రూపాలకు నిలయంగా బాల సాహిత్య వేదిక ఏర్పాటు చారిత్రక అవసరమని పలువురు కవులు అభిప్రాయపడ్డారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీతారంనగర్‌లో జిల్లా సాహిత్య వేదికను ఏర్పాటు చేశారు. ప్రముఖ కవి, విమర్శకుడు, తెలుగు భాషోపాధ్యాయుడు డాక్టర్ కాసర్ల నరేష్‌రావు ఈ సభను ఏర్పాటు చేశారు. జిల్లాలోని ప్రముఖ కవులు, బాల సాహిత్యవేత్తలతో కలిసి ఈ వేదిక ఏర్పాటు చేశారు. జిల్లాలో బాలల సాహిత్యాన్ని ప్రోత్సహించాలని, అందుకు వారికి సరైన తర్ఫీదునివ్వాలన్నారు. పిల్లల్లో పఠనాసక్తి పెంచడం, పద్యం, అవధానంలలో తర్ఫీదునివ్వనున్నట్లు నరేష్‌రావు తెలిపారు. ఈ సాహిత్య తొలి అధ్యక్షుడిగా డాక్టర్ కాసర్ల నరేష్‌రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దేశ్‌ముఖ్ ప్రవీణ్, దారం గంగాధర్, గంట్యాల ప్రసాద్, డాక్టర్‌శారదా హన్మాండ్లు, ప్రణవి, డాక్టర్.ఎ.శ్రీదేవి, నీలవేణి, జి.ఇందిర, కైరంకొండ బాబు, శ్రీమన్నాచార్య తదితరులను కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగిందని వారు పేర్కొన్నారు.

చికిత్సపొందుతూ యువకుడి మృతి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 5: డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఘన్‌పూర్ చెరువుకట్ట దూస్‌గాం వెళ్లే రోడ్డుపై గురువారం రాత్రి ద్విచక్రవాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురైందని ఎస్సై మహేష్ తెలిపారు. కాగా బైకుపై ఉన్న డిచ్‌పల్లి గ్రామానికి చెందిన నవీన్ కింద పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జిల్లాకేంద్రంలోని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం నవీన్ మృతి చెందాడని ఎస్సై తెలిపారు. మృతుడి తండ్రి కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

నమ్మబలికి.. మాట మార్చిన దళారీ!!

- ఎడపల్లిలో దళారీని నమ్మి మోసపోయిన రైతులు
- అధికారులు దళారుల వ్యాపారంపై నిఘా పెట్టాలని డిమాండ్

ఎడపల్లి, ఏప్రిల్ 5: రబీ(యాసంగి)లో వరి కోతలు ఊపందుకున్నాయి. అందులో భాగంగా రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు చేతికొచ్చిన వేళ పచ్చి ధాన్యం రేటు ఆసక్తికరంగా ఉండడంతో వరి కోతలు మొదలుపెట్టారు. ఇందులో భాగంగా దాదాపు వంద ఎకరాల రైతులు తమ వరి పంటను కోతలు కోసి దాన్యాన్ని ఒక చోటికి చేర్చారు. అయితే ధాన్యం కుప్పలను చూసి కుప్పల దగ్గరికి వచ్చిన స్థానిక దళారి.. పచ్చి దాన్యాన్ని కొనుగోలు చేస్తానని హామీ ఇచ్చి నమ్మించాడు. మూడు రోజులుగా దళారి వడ్లు నింపకపోవడంతో రైతులు ప్రతీరోజు దళారీని వడ్లు ఎప్పుడు నింపుతావు అని అడగగా.. ఇప్పుడే నింపుతామని సమాధానం ఇస్తూ అలా మూడు రోజుల పాటు దాట వేశాడు. మూడు రోజుల తర్వాత వచ్చి ధాన్యం రంగు మారిందని చేతులెత్తేశాడు. ఈ తతంగం ఎడపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎడపల్లికి చెందిన కొంతమంది రైతులు గ్రామ శివారులోని శివాలయం వద్ద వరి కోతలు కోసి ధాన్యాన్ని ఒక్కచోటుకి చేర్చారు. అప్పుడు అక్కడికి వచ్చిన స్థానిక దళారి పచ్చి ధాన్యానికి రేటు మాట్లాడుకుని వడ్లు కొంటానని హామీ ఇవ్వడంతో సరేనన్నారు. అలా దళారి చెప్పి నాలుగు రోజులు కావొస్తున్నా.. ధాన్యం కొనకపోవడంతో వరి కుప్పలు అలానే ఉండి పోయాయి. దీంతో రైతులు దళారీ దగ్గరకు వెళ్లి నాలుగు రోజులవుతుంది. వడ్లు కొంటానని చెప్పి కుప్పలు అలానే ఉన్నాయని నిలదీయగా.. వడ్ల కుప్పల దగ్గరకు వచ్చిన దళారీ వడ్లను చూసి వడ్లు రంగు మారాయి.. తాను కొనను అని సమాధానం చెప్పి అక్కడి నుంచి వెళ్లి పోయాడు. దీంతో రైతులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. దళారీ వడ్లు కొనను అంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో అమ్మేవారమని, దళారీ పచ్చి వడ్లు కొంటామంటే ఎండబెట్టే ఖర్చు మిగులుతుందనే ఆశ పడి మోసపోయామన్నారు. ఇలా ప్రతీయేడు రైతులను దళారులు మోసం చేస్తున్నారని, దళారులు సిండికేట్‌గా మారి వారికి ఇష్టం వచ్చిన ధరలకు వడ్లు కొనుగోలు చేస్తున్నారని బాధిత రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగానే.. దళారులు కోత కోసి ఎండ బెట్టడానికి సిద్ధపడుతున్న రైతుల దగ్గరకు వచ్చి పచ్చి ధాన్యం కొంటామని హామీ ఇచ్చి నాలుగైదు రోజుల తర్వాత ధాన్యం రంగు మారిందని చెప్పి తక్కువ ధరకు కొంటున్నారని, యేటా ఇలానే మోసం చేస్తున్నారని రైతులు బోరుమంటున్నారు. రైతులను నమ్మించి మోసం చేసిన దళారిపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

● రంగుమారాయని చెప్పి.. : గుమ్ముల ప్రవీణ్, బాధిత రైతు



నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాను. ఈనెల 2న కోతకు వచ్చిన వరి పంటను కోత కోసి వరి ధాన్యం కుప్ప పోయగా.. అక్కడకు వచ్చిన స్థానిక వడ్ల వ్యాపారి నర్సింలు పచ్చి ధాన్యం కొనుగోలు చేస్తానన్నాడు. దీంతో వరి కప్పను అలానే ఉంచాను. శుక్రవారం దళారి వేరే వడ్లను పరిశీలిస్తుండగా వెళ్లి నిలదీయగా దళారి వచ్చి వరి ధాన్యం కుప్పను చూసి వడ్లు రంగు మారాయి, తాను కొనను అని చెప్పి వెళ్లి పోయాడు. దళారి మాటలను నమ్మి మోసపోయాను. దళారిపై చర్యలు తీసుకోవాలి.

● యేటా ఇలానే చేస్తున్నారు : ప్రవీణ్ కుమార్, రైతు, బర్దీపూర్



ప్రతీ సంవత్సరం రైతులను దళారులు మోసం చేస్తున్నారని దళారులు సిండికేట్‌గా మారి వారికి ఇష్టం వచ్చిన ధరకు వడ్లను కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగానే పచ్చి వడ్లకు అదిక ధర ఇస్తామని చెప్పి రైతులకు ఆశ చూపించి నమ్మించి నాలుగు రోజులపాటు వరి దాన్యం నింపక కుప్పలను అలాగే ఉండినిచ్చి అవి రంగు మారిన తరవాత కొనక పోవడంతో నష్టానికి దళారులకే విక్రయించేలా పన్నాగాలు పన్నుతున్నారని, దళారుల వ్యాపారంపై అధికారులు నిఘా పెట్టి రైతులు మోసపోకుండా చూడాలి.


రంగు మారిన ధాన్యాన్ని చూపుతున్న బాధిత రైతు



లింగారెడ్డిని కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న జీవన్‌రెడ్డి, సునీల్‌కుమార్

కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు

ఏర్గట్ల, ఏప్రిల్ 5: మండల కేంద్రంతో పాటు గుమ్మిర్యాల, దోంచంద గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి, ముత్యాల సునీల్‌కుమార్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో గుమ్మిర్యాల్ మాజీ ఎంపిటీసి గడ్డం లింగారెడ్డి, దోంచంద మాజీ ఉపసర్పంచ్ ఇప్ప గంగయ్యతో పాటు పలువురు పార్టీలో చేరారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, పార్టీ మండల అధ్యక్షుడు సోమ దేవరెడ్డి, బద్దం లింగారెడ్డి, పన్నాల నర్సారెడ్డి, ముస్కు మోహన్, ఇంద్రసేనా రెడ్డి, మునీర్, భాను పాల్గొన్నారు.

ఆర్ఎంపీని బెదిరించి

దోపిడీ చేసిన ఇద్దరు దొంగల అరెస్టు

జక్రాన్‌పల్లి, ఏప్రిల్5: మండలంలోని కొలిప్యాక్ గ్రామానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ పసుల గంగాధర్‌ను ట్రీట్‌మెంట్ నిమిత్తమై ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై ఎక్కించుకొని గ్రామ పరిసరాల్లోని నిర్మాణ ప్రదేశాల్లోకి తీసుకువెళ్ళి కత్తి చూపించి డాక్టర్‌ను బెదిరించి అతని వద్ద ఉన్న వస్తువులను తీసుకొని దొంగాలించారని ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపారు. డిచ్‌పల్లి సీఐ మల్లేష్, జక్రాన్ పల్లి ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొలిప్యాక్ గ్రామంలో ఈనెల 3న మధ్యాహ్నం అదే గ్రామానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ పశువుల గంగా ధర్‌ను ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై ఎక్కించుకొని నిర్మాణ ప్రదేశంలోకి తీసుకువెళ్ళి కత్తిచూపించి డాక్టర్ వద్ద ఉన్న బంగారు ఉంగారాం, రూ.5వేల నగదు, ఒక సెల్‌ఫోన్ ఇద్దరు దొంగలు దోచుకు వెళ్ళిన కేసులో శుక్రవారం ఆర్మూర్ ఒడ్డెరకాలనీకి చెందిన చిన్న గంగాధర్, ద్యావల నర్సయ్య, తొర్లికొండకు చెందిన కాట్‌పల్లి సతీష్ అలియాస్ గంగారెడ్డి అనే ఇద్దరు నిందితులను అరెస్టుచేసి వీరి వద్ద నుంచి దోపిడీ చేసిన బంగారం ఉంగారాం, ఒక సెల్‌ఫోన్, రూ.1500 నగదును వారు ఉపయోగించిన బైక్‌లను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు వారు తెలిపారు. పోలీస్ సిబ్బంది సర్దార్ భూపతి, సతీష్, డిచ్ పల్లి సీఐ మల్లేష్, జక్రాన్‌పల్లి ఎస్సై సీహెచ్ తిరుపతిలు కలిసి నిందితులను పట్టుకున్నట్టు తెలిపారు.



బాబూ జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీ అర్వింద్



టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో..



టీడీపీ ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న దృశ్యం



ఆర్మూర్‌లో విగ్రహానికి పూలమాలలు వేసిన మున్సిపల్ చైర్‌పర్సన్



గడ్కోల్ గ్రామంలో..



మోర్తాడ్‌లో నివాళులు అర్పిస్తున్న దళిత సంఘం నాయకులు

ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి

దేశ మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూజగ్జీవన్‌రాం జయంతి వేడుకలను జిల్లావ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆయా సంఘాల ప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. బాబూజగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాబూజగ్జీవన్‌రాం అందించిన సేవలను పలువురు కొనియాడారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎన్నికల నియమావళి అనుసరిస్తూ జయంతి వేడుకలు నిర్వహించారు.

● న్యూస్‌నెట్ వర్క్



తాడ్‌బిలోలి గ్రామంలో..



సీపీఐ ఆధ్వర్యంలో..



కమ్మర్‌పల్లిలో నివాళులర్పిస్తున్న మండల దళిత సంఘాల నాయకులు



నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



ముప్కాల్‌లో నినాదాలు చేస్తూ..



కోటగిరిలో నిర్వహించిన జయంతి వేడుకలలో..



నవీపేటలో..



ఎడపల్లిలో ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో..

పడకల్‌లో ఆర్మీ జవాన్ ఆత్మహత్య

జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 5: మండలంలోని పడకల్ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ బోండ్ల భరత్ (30) ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై సీహెచ్ తిరుపతి తెలిపారు. పడకల్ గ్రా మానికి చెందిన భరత్ గతంలో ఆర్మీ జవాన్‌గా పని చేశాడని, గత మూడేళ్లుగా విధులకు హాజరుకాకపోవడంతో ఉద్యోగం కోల్పోయా రని, అప్పులు చేసి ఆర్థిక సమస్యలు ఎక్కువకావడంతో గురువారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో మనస్థాపం చెంది దులాని కి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

తిమ్మాపూర్‌లో ఈతవనాల దగ్ధం

మోర్తాడ్, ఏప్రిల్5: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో గీత కార్మికులకు పెంచుకుంటున్న ఈత చెట్లు దగ్ధమయ్యాయి. అయితే వీటిని ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు చెట్లకు నిప్పు పెట్టి ఉంటారని అనుమానిస్తున్నారు. కార్మికులు శుక్రవారం ఉదయం ఈతవనానికి వెళ్లగా కొన్ని ఈత చెట్లు కాలిపోతూ కనిపించాయని తెలిపారు. గీత కార్మికులు ఉపాధి కోసం నాలుగేళ్ల క్రితం నుంచి 10 ఎకరాలలో ఈత చెట్లను పెంచుకుంటున్నారు. గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారని తెలిపారు. కావాలనే ఎవరో పథకంప్రకారం ఈతచెట్లను కాలివేశారని ఆరోపిస్తున్నారు. గత ఐదేళ్ల నుంచి పెంచుకుంటున్న ఈతవనం దగ్ధ కావడం పట్ల తాము ఉపాధి కోల్పోయామని గీత కార్మికులు వాపోయారు. ఈ విషయాన్ని మోర్తాడ్ ఎక్సైజ్ కార్యాలయ అధికారులకు వివరించగా వారు స్పందించలేదని, కనీసం ఈతవనం సందర్శించలేదని బాధితులు చెప్తున్నారు. ఎవరైనా దుండుగల పేర్లు చెబితే వారిపై కేసు నమోదు చేస్తామని ఎక్సైజ్ అధికారులు అనడం విస్మయం కలిగించింది. అధికారులు స్పందించి చట్టరీత్య చర్యలు తీసుకోవాలని గీత కార్మికులు కోరారు.

దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

మాక్లూర్, ఏప్రిల్5: రైతులు తాము పండించిన పంటలను ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనే అమ్ముకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దని మాక్లూర్ సొసైటీ చైర్మన్ బుర్రోల్ల అశోక్ అన్నారు. శుక్రవారం మండలంలోని మెట్‌పల్లి, వల్లభపూర్, గొట్టుముక్కుల, మాక్లూర్ గ్రామాలలో ధ్యానం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రావు, దయాకర్‌రావు, కాశీనాథ్‌రావు, విండో పాలకవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన చంద్రయాన్‌పల్లి మాజీ సర్పంచ్

ఇందల్వాయి, ఏప్రిల్5: మండలంలోని చంద్రయాన్‌పల్లి గ్రామ మాజీ సర్పంచ్ లలిత గంగాదాస్ కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. ఇన్నాళ్లు బీఆర్ఎస్ పార్టీలో ఉన్న ఆయన శుక్రవారం రూరల్ ఎమ్మెల్యే బూపతిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనతో పాటు ఉపసర్పంచ్ ప్రకాశ్, మాజీ సర్పంచ్ మురళి, మరికొంత మంది బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్తలు చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో విశేష ఆదరణ పెరుగుతుందని ఈ నేపథ్యంలో ఇతర పార్టీలకు చెందిన కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో అవినీతి అనచివేతలు తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ స్థానాన్ని భారీ మెజార్టీతో గెలిపించి మరోసారి కాంగ్రెస్ జెండాను రెపరెపలాడిస్తామని ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఇందల్వాయి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్, కుమ్మరి గంగాధర్, మల్లయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ గంగారెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు.

పొతంగల్‌లో అన్నను చంపిన తమ్ముడు

● కుటుంబ కలహాలతో దారుణం

కోటగిరి, ఏప్రిల్ 5: కుటుంబ కలహాలతో అన్నను తమ్ముడు దారుణంగా హత్య చేసిన ఘటన పొతంగల్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పొతంగల్ గ్రామానికి చెందిన మంగళి గోవింద్ (54)ను అతడి తమ్ముడు విఠల్ గొడ్డలితో దాడిచేసి దారణంగా హత్యచేశాడు. గోవింద్ పొతంగల్‌లో మంగళి పనిచేస్తూ జీవనం సాగించేవాడు. తమ్ముడు విఠల్ కుటుంబం తరుచూ గొడవ పడుతూ ఉండేవారు. తమ్ముడితోపాటు తమ్ముడి భార్యను పలుమార్లు సముదాయించి నచ్చజెప్పేవాడు. భార్యభర్తల మధ్య గురువారం రాత్రి మరోమారు ఘర్షణ జరిగింది. పని ముగించుకుని గోవింద్ ఇంటికి వచ్చాడు. అప్పటికే కక్ష పెంచుకుని విఠల్ అన్న గోవింద్‌పై గొడ్డలితో దాడిచేశాడు. ఈ ఘటనలో గోవింద్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనాస్థలాన్ని రుద్రూర్ సీఐ జయేష్ రెడ్డి పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ కలహాలతోనే హత్య జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.



ప్రచార రథాలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

బీఆర్ఎస్ ప్రచార రథాలు ప్రారంభం

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 5: బీఆర్ఎస్ పార్టీ ప్రచార రథాలను కామారెడ్డి జిల్లా కేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జహీరాబాద్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా 5 ప్రచార రథాలను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధికార ప్రతినిధి గైని శ్రీనివాస్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్ రెడ్డి, కౌన్సిలర్‌లు పిట్ల వేణుగోపాల్, లక్ష్మీనారాయణ, రవితేజ, భానుప్రసాద్, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో దీక్ష

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 5: రైతులు పండించిన పంటలకు మద్దతు ధరపై అదనంగా రూ.500ల బోనస్ అందించాలని డిమాండ్ చేస్తు బీఆర్ఎస్ నేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ వద్ద దీక్ష చేపడుతున్నట్లు జిల్లా అధ్యక్షుడు ముజిబొద్దీన్ తెలిపారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో ఈ దీక్ష చేపడుతున్నందున నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున ఉదయం 10.30 వరకు చేరుకోవాలని తెలిపారు.



ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

రేపు మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 5 : ఆదివారం నిర్వహించనున్న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎల్లారెడ్డి ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సాయిబాబా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తరగతి ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని విద్యార్థులు 9 గంటలకి పరీక్ష కేంద్రానికి రావాలని తెలిపారు. మధ్యాహ్నం 7, 8, 9, 10 తరగతిలో ప్రవేశ పరీక్షలకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న ఎల్లారెడ్డి జడ్పీటీసీ

కాంగ్రెస్‌లో చేరిన ఎల్లారెడ్డి జడ్పీటీసీ

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 5: ఎల్లారెడ్డి జడ్పీటీసీ ఉషాగౌడ్ శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు, ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'నకిలీ విత్తనాలు ఇచ్చిన వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తాం'

బీర్కూర్, ఏప్రిల్ 5: రైతులకు నకిలీ విత్తనాలు అంటగట్టి తీవ్రంగా నష్టపరిచిన గ్రోమోర్ షాపు సిబ్బందిపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేయిస్తామని మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం బీర్కూర్ మండల కేంద్రంలో స్థానిక నాయకులు, రైతులు జరిగిన విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ రైతులకు నష్ట పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. గ్రోమోర్ వారు వెంటనే స్పందించి రైతులకు నష్ట పరిహారం అందించాలని లేనిపక్షంలో పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేయిస్తామని హెచ్చరించారు.

డివిజన్, మండల ఎస్టీ సెల్ కమిటీల నియామకం

బీర్కూర్, ఏప్రిల్ 5 : బాన్సువాడ నియోజకవర్గంలో డివిజన్, మండల స్థాయి ఎస్టీ సెల్ కమిటీలను నూతనంగా ఎన్నుకున్నట్లు జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు రాణా ప్రతాప్ రాథోడ్ తెలిపారు. శుక్రవారం బీర్కూర్ మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి చేతుల మీదుగా నూతన చైర్మన్లకు నియామక పత్రాలు అందజేశారు. ఎస్టీ సెల్ బాన్సువాడ డివిజన్ చైర్మన్‌గా చందర్ జాదవ్, బీర్కూర్ మండల చైర్మన్‌గా దిలీప్ చవన్, నసురుల్లాబాద్ మండల చైర్మన్‌గా శంకర్ నాయక్, బాన్సువాడ మండల చైర్మన్‌గా రూప్‌సింగ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాణా ప్రతాప్ రాథోడ్ తెలిపారు.



బాన్సువాడలో బాబూ జగ్జీవన్‌రాం చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న పోచారం



కామారెడ్డిలో..



మద్నూర్‌లో..

అంటరానితనం నిర్మూలనకు కృషి చేసిన బాబూ జగ్జీవన్‌రాం

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 5: అంటరానితనం నిర్మూలించేందుకు బాబూ జగ్జీవన్‌రాం ఎంతగానో కృషి చేశారని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మహాత్ముల జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో భారత ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రాం జయంతిలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే పోచారం జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం అలుపెరుగని పోరాటం చేశారని, దేశ సంరక్షణ కోసం కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ జంగం గంగాధర్ మహాత్ముల జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పోశీరాం తదితరులున్నారు.

దోమకొండ: గొట్టుముక్కుల గ్రామంలోని ఎస్సీ సంఘం ఫంక్షన్ హాల్‌లో బాబూ జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నత్తి రమేష్, నత్తి గణేష్, వెంకటేష్, నవీన్, శశాంక్, రాజమౌళి, పరశురాం, కిరణ్, రామ్‌చంద్ర, శంకర్, పురుషోత్తం, శివకు మార్ తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి : రామారెడ్డి మండల కేంద్రంతో పాటు రెడ్డిపేట, మద్దికుంట, పోసానిపేటతో పాటు తదితర గ్రామాల్లో శుక్రవారం డాక్టర్ బాబూ జగ్జీవన్‌రాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, యువకులు పాల్గొన్నారు.

మద్నూర్: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రాం జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మద్నూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంగమేశ్వర్ ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిలు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు రమేష్, నాయకులు రవి, కుశాల్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్: బీర్కూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదుట గల జగ్జీవన్‌రామ్ విగ్రహానికి దళిత సంఘం నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు శివరాజు తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం వద్ద కామారెడ్డి శాసనసభ్యులు కాటిపల్లి వెంకటరమణారెడ్డి బాబూ జగ్జీవన్ రాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా మున్సిపల్ శాఖ కమీషనర్ సుజాత ఆధ్వర్యంలో కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఎంఆర్‌పీఎస్, టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాలలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్, చిట్యాల సాయన్న, బాగయ్య, నరాల వెంకట్‌రెడ్డి, సాయిలు, నాగరాజు, చక్రధర్, సాయిలు, పోచయ్య, లక్ష్మణ్, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు: మండల కేంద్రంతో పాటుగా ఆయా గ్రామాల్లో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆయన చిత్రపటానికి నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాల్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఆయా గ్రామాల ప్రజలు, నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పేరక శ్రీనివాస్, ఎంపీపీ విఠల్, కంది మల్లేష్, రాము, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.



బీర్కూర్‌లో..



దోమకొండలో..



భిక్కనూరులో..

రైతులకు పరిహారం ఎందుకు ఇవ్వరు?

● ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డిటౌన్, ఏప్రిల్ 5: రాష్ట్ర ప్రభుత్వం రైతులు నష్టపోయిన పంటలకు పరిహారం ఎందుకు ఇవ్వడం లేదని అత్యవసర పరిస్థితి కింద రైతులకు పరిహారం చెల్లించవచ్చని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద బీజేపీ ఆధ్వర్యంలో బీజేపీ సత్యగ్రహ దీక్ష చేపట్టింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడగల్ల వానకి పంట నష్టపోయిన విషయంలో అధికారులు క్షేత్రస్థాయిలో సరైన విధంగా సర్వే చేయలేదని ఒక్క కామారెడ్డి నియోజకవర్గంలోనే 14 వేల ఎకరాలు నష్టపోతే జిల్లా మొత్తం కలిపి 14 వేల ఎకరాలు నష్టపోయినట్లు లెక్కచూపారని తెలిపారు. నష్టపోయిన పంటకి పరిహారం ప్రకటించిన ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ ఉన్నప్పటికి అత్యవసర పరిస్థితి కింద రైతులకి పరిహారం చెల్లించవచ్చని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు కూడా సరిగ్గాచెల్లించలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని అన్నారు. రైతులకి భరోసా కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ సత్యగ్రహ దీక్ష చేపట్టామని తెలిపారు. అనంతరం జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బీబీపాటిల్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 6 గ్యారెంటీలని చెప్పి అమలు మాత్రం చేయడం లేదని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు అరుణతార,బీజేపీ ఉపాధ్యాక్షులు యెండల లక్ష్మీనారాయణ, బీజేపీ రాష్ట్రనాయకులు లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శులు నరేందర్‌రెడ్డి, రవీందర్‌రావు, అసెంబ్లీ కన్వీనర్‌లు లక్ష్మారెడ్డి, లింగారావు, జిల్లా మోర్చాల అధ్యక్షులు లక్ష్మారెడ్డి, వేణు, అనిత, బాలరాజు, పట్టణ అధ్యక్షుడు భరత్ తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, పార్టీ నాయకులు

కామారెడ్డికి తరలిన బీజేపీ శ్రేణులు

దోమకొండ: రాష్ట్రవ్యాప్తంగా రైతులకు మద్దతుగా బీజేపీ చేపడుతున్న రైతు సత్యగ్రహ దీక్షలో భాగంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించే కార్యక్రమానికి మండల బీజేపీ శ్రేణులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు భూపాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పంటనష్టంను త్వరగా అందించాలని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రైతులకు డబ్బులు అందించాల్సిన అవసరం ఎంతైన ఉందని ఆయన తెలిపారు.కామారెడ్డికి తరలిన వారిలో పట్టణ అధ్యక్షువు రవి, కిసాన్‌మోర్చా అధ్య క్షుడు నరేందర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్, నాయకులు రవీందర్‌రెడ్డి, నర్సింలు, ప్రభాకర్ ఉన్నారు.

నేడు బీఆర్ఎస్ దీక్ష

బాన్సువాడటౌన్, ఏప్రిల్ 5: కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా శనివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసనదీక్ష చేపడుతున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు.

బీజేపీలో పలువురి చేరిక

కామారెడ్డి రూరల్, ఏప్రిల్ 5: పట్టణంలోని దేవునిపల్లికి చెందిన మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవీందర్ తో పాటు 42 మంది, 41వ వార్డుకు చెందిన 23 మంది కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో కాషాయ కండువా కప్పుకొని బీజేపీలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జహీరాబాద్ పార్లమెంట్ ప్రజల చూపు బీజేపీవైపు ఉందని వచ్చే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి పట్టం కట్టనున్నారని తెలిపారు. దేశంలో మరోసారి రానున్నది మోదీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు.

జహీరాబాద్ పార్లమెంట్‌లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తాం



కార్యకర్తలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, ఎంపీఅభ్యర్థి సురేష్ శెట్కార్, నాయకులు

లింగంపేట, ఏప్రిల్ 5: పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ అన్నారు. ఆయన శుక్రవారం మండలంలోని అమృత గార్డెన్‌లో ఎల్లారెడ్డి నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పది సంవత్సరాలుగా బీబీ పాటిల్ ఎంపీగా పనిచేసి ఎలాంటి అభివృద్ధి చేయలేదని, కనీసం గ్రామానికో కార్యకర్తను గుర్తుపట్టలేదని ఆయన విమర్శించారు. బీబీ పాటిల్ అంటే బిజినెస్ మ్యాన్ అని ఆయన బిజినెస్‌ల కోసమే ఎంపీగా పోటీ చేస్తున్నాడని ఆయనకు ఈ ఎన్నికల్లో బైబై చెప్పాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. నియోజకవర్గంలో 206జీపీలలో కాంగ్రెస్ గ్రామ కమిటీలను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి పార్లమెంట్ అభ్యర్థి సురేష్ శెట్కార్‌కు అత్యధిక మెజారిటీ అందించాలని అందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎలారెడ్డి జడ్పీటీసీ ఉషాగౌడ్ కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో పీసీసీ అబ్జర్వర్ భాస్కర్ యాదవ్, డీసీసీ అధ్యక్షుడు కైలాస శ్రీనివాస్‌రావు, జడ్పీటీసీ శ్రీలత, పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, నాయకులు ఉన్నారు.

మహాదీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

ఎల్లారెడ్డి: మండలంలోని సోమిర్యఘడ్ తండాలో నిర్మాణంలో ఉన్న ఆలయం వద్ద శుక్రవారం దీక్ష గురు శ్రీ ప్రేమ్‌సింగ్ మహరాజ్ ఆధ్వర్యంలో సేవాఘడ్ వద్ద శుక్రవారం మహాదీక్ష కార్యక్రమం నిర్వహిస్తున్న సందర్భంలో ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు పాల్గొన్నారు. గిరిజనుల ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహరాజ్ ఉత్సవాలను నిర్వహించారు. అనంతరం భోగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గిరిజనులందరూ ఐక్యంగా ఉండి సేవాలాల్ దేవాలయం అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గోవింద్, గణేష్, లాకవావత్ రవి, నగేష్, ధన్సింగ్, శ్రీను, మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, ఆరీఫ్, మాజీ జడ్పీటీసీ సామేలు, ఆలయ భక్తులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో భారీ మెజార్టీతో సత్తా చాటాలి

● మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి

బీర్కూర్, ఏప్రిల్ 5: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి బాన్సువాడ నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీ అందించి మన సత్తా చాటాలని, మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్య కర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన సమక్షంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన సుమారు 300 మంది నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శనివారం హైదరాబాద్‌లో జరిగే సభకు కాంగ్రెస్ అగ్ర నేతలు వస్తున్నారని బాన్సువాడ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలివెళ్లాలన్నారు. అదే విధంగా ఆదివారం బాన్సువాడలో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సమావేశానికి ప్రతి బూత్ నుంచి 15 నుంచి 20 మంది తరలిరావాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాములు, కాంత్‌రెడ్డి, బస్వరాజు, చందు, శంకర్, భాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కమలాకర్‌రెడ్డి, శ్రీనివాస్, అబ్దుల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కొలతల ఆధారంగానే ఇంటిపన్ను

బాన్సువాడటౌన్, ఏప్రిల్ 5: భవన నిర్మాణ కొలతల ఆధారంగానే ఇంటిపన్నులు విధిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని పలు ఇండ్ల నిర్మాణ కొలతలను పరిశీలించారు. కొలతల ప్రకారం నిర్మాణం చేపట్టిన ఇళ్లకు మున్సిపల్ ట్యాక్స్ వేయడం జరిగిందని వారు తెలిపారు. ప్రజలు తమతమ ఇళ్ల ట్యాక్సులను సకాలంలో చెల్లించి, బాన్సువాడ మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు మల్లికార్జున్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తుల శ్రీనివాస్, సిబ్బంది తదితరులున్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్ - ప్రాజెక్ట్(జడ్)
శాంతి - టిల్ స్క్వేర్
ప్రియా 70 - ది ఫ్యామిలీ స్టార్

బాన్సువాడ

మహేశ్వరి - ది ఫ్యామిలీ స్టార్
వెంకటేశ్వర - గోట్‌లైఫ్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

